ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక వాయిదా

కడప (క్రైం), సెప్టెంబరు 15: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం 16వ తేదీ నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిలాదున్‌నబీ (ప్రభుత్వ సెలవుదినం) పండుగ అయినందున కార్యక్రమాన్ని వాయిదా వేసి 17వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నామని, అర్జీదారులు గుర్తుంచుకుని రావాలని సూచించారు.

ఇద్దరు ఎంఈవోల విధానానికి స్వస్తి?

● స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 15: మండలానికి ఇద్దరు ఎంఈవోల విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకనున్నట్లు సమాచారం. గతంలో మాదిరిగా ఎంఈవో ఒక్కరే ఉంటారు. అయితే పాఠశాలల్లో విద్యాబోధనను పర్యవేక్షించడానికి స్కూలుకాంప్లెక్స్ వ్యవస్థను పటిష్ఠం చేసి అక్కడ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. గతంలో మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. విద్యాబోధన, టీచర్ల సర్వీసు వ్యవహారాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరు పర్యవేక్షించేవారు. అయితే ఎంఈవోలకు పనిభారం ఎక్కువగా ఉందని భావించిన గత వైసీపీ ప్రభుత్వం ప్రతి మండలానికి రెండో ఎంఈవో పోస్టును కేటాయించారు. ఎంఈవో-1గా ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు ఎంఈవో 2గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలలో సీనియర్లకు అవకాశం కల్పించారు.

మండలంలో పాఠశాలల పర్యవేక్షణ కంటే ఇరువురు ఎంఈవోల మధ్య ఆధిపత్య పోరే ఎక్కువగా ఉండేది. ప్రైవేటు స్కూళ్ల గుర్తింపు వ్యవహారంలో ఎంఈవోల మధ్య యుద్ధం కొనసాగుతుండేది. చివరికి కొత మంది సహకారంతో ప్రైవేటు పాఠశాలలను ఇద్దరు చెరో సగం పంచుకుని పాలన చేస్తుండేవారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇద్దరు ఎంఈవోల మధ్య వివాదాలు ఎక్కువగా ఉండడంతో కొత్త ప్రభుత్వం మండలానికి ఒకరిని మాత్రమే ఉంచాలని సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం కూడా వచ్చినట్లు సమాచారం. ఒ క ఎంఈవోనే కొనసాగిస్తే పాఠశాలలపై పర్యవేక్షణ బాధ్యత స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అప్పగించనున్నారు. జిల్లాలో 236 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 181 స్కూ లు కాంప్లెక్స్‌లున్నాయి. తాజా నిర్ణయంతో స్కూలు కాంప్లెక్స్‌ల సంఖ్య స్వల్పంగా తగ్గుతుందని తెలుస్తుంది. మారుమూల ప్రాంతాల్లో ఉన్న స్కూలు కాంప్లెక్స్‌ల బాధ్యత అందుబాటులో ఉన్నత పాఠశాలలకు అప్పగించనున్నారు.

ఎటువంటి ప్రతిపాదనలు రాలేదు..



ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రతిపాదనలు రాలేదు. అయితే ఎంఈవోల సీనియారిటీ డేటా అడిగారు. ఉప విద్యాధికారులుగా ఎంత మంది విల్లింగ్ ఉన్నారన్న సమాచారం కూడా అధికారులు అడిగారు. ఈ సమాచారం కూడా పంపించడం జరిగింది.

\- అనురాధ, డీఈవో


లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో జిల్లాకు 5వ స్థానం

● 4878 కేసులు మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం

● జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, సెప్టెంబర్ 15: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఉమ్మడి కడప జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లాకు 5వ స్థానం లభించిందని డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తెలిపారు. జాతీయ లోక్అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 23 బెంచ్‌లను ఏర్పాటుచేసి 4878 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించడం జరిగిందన్నారు. ఇందులో 4,484 క్రిమినల్ కేసులను, 270 సివిల్ కేసులు, 124 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఆయా కోర్టుల వారీగా కడప జిల్లా కోర్టులో 1544 కేసులను, ప్రొద్దుటూరులో 542 కేసులు, రాజంపేటలో 56 కేసులు, రాయచోటిలో 106 కేసులు, బద్వేల్‌లో 1202 కేసులు, జమ్మలమడుగులో 721 కేసులు, సిద్దవటంలో 118 కేసులు, రైల్వేకోడూరులో 66 కేసులు, పులివెందులలో 301 కేసులు, లక్కిరెడ్డిపల్లెలో 58 కేసులు, కమలాపురంలో 132 కేసులు పరిష్కారించినట్లు తెలిపారు. పై మొత్తం కేసులకు రూ.24,72,78,105లను కక్షిదారులకు చెల్లించడం జరిగిందన్నారు. కాగా, కేసుల పరిష్కారానికి పాటుపడిన న్యాయవాదులకు, పోలీస్, రెవెన్యూ, బ్యాంకు, ఇన్సూరెన్స్ అధికారులకు డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

బార్‌లా.. తెరిచే ఉంటాయి..



● 24 గంటలూ అమ్మకాలు

● పేరుకే బార్ అండ్ రెస్టారెంట్.. ఎక్కడా ఫుడ్ లేని వైనం

● కళ్లు మూసుకున్న నిఘా నేత్రం

● కూటమి అధికారంలోకి వచ్చినా ఆగని బార్ల దందా



తాగుతున్న మందుబాబులు

(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో దశల వారీ మద్యనిషేధం బూటకమైంది. ఇక నిబంధనల మేరకు జరగాల్సిన మద్యం అమ్మకాలు ఇష్టారాజ్యంగా జరిగిపోయాయి. బార్లు, వైన్‌షాపుల టైంకు తెరుచుకుని, టైంలోపే క్లోజ్ చేయాలి. అయితే ఇదేమీ జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి మూడు నెలలు దాటినా కూడా సేమ్ టు సేమ్‌గా మద్యం అమ్మకాలు జరుపుతుండడం చూసి జనం అవాక్కవుతున్నారు. కోడి కూయక ముందు పాల ప్యాకెట్ దొరకదేమో కానీ మందు మాత్రం పుష్కలంగా దొరుకుతుంది. అయితే 10గంటలకు అయితే ఒక రేటు ఉంటే, తెల్లారేసరికి నిద్రలేచేసరికి అంటే కోడి కూడయకముందే అయితే దానికి స్పెషల్ రేటు ఉంటుంది. ఇక జిల్లాలో ప్రభుత్వ మద్యం షాపులకు టైమింగ్ ఉందేమో కానీ బార్లకు మాత్రం నోటైమ్స్, ఎందుకంటే అవి 24గంటలు తెరుచుకుని ఉంటాయి. అంటే మందుబాబు భాషలో చెప్పాలంటే అవి ఆసుపత్రిలాంటివి. అందుకనేమో ఇక్కడ లిక్కర్ అమ్మకాలకు నో టైమింగ్స్, ఎప్పుడు చూసినా మందు దొరుకుతూనే ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అమ్మకాలను చెక్ పెట్టాల్సిన అధికార యంత్రాంగం బార్ల యజమాన్యానికి సలాం చేస్తూ వారి అడుగులకు మడుగులొత్తుతోంది. చంద్రబాబు సీఎం అయినా కూడా వైసీపీ పాలనలో మాదిరిగా మద్యం అమ్మకాలు చూసి జనం అవాక్కవుతున్నారు.

మందుబాబులకు జగన్ పాలన ఓ విషపు రక్కసిలాంటిది. స్టేట్‌లో ఎన్నో ఏళ్లుగా తాగుతున్న, దొరుకుతున్న మద్యానికి జగన్ నూతన మద్యం పాలసీ పేరిట వాటికి చెక్ పెట్టేశారు. దశల వారీగా మద్యనిషేధం పేరుతో రకరకాల విన్యాసాలు చేశారు. మందు మాన్పించేందుకే బాటిళ్లను ముట్టుకుంటే షాక్ కొట్టే విధంగా కవరింగ్ ఇచ్చుకున్నారు. మద్య నిషేధానికి కట్టుబడి ఉన్నామని చెప్పుకునేందుకే ప్రైవేటు షాపులను రద్దు చేసి ప్రభుత్వ మద్యం షాపులను తెచ్చామన్నారు. దేవుడిగుట్టు పూజారులకు ఎరుక అన్నట్లుగా కొత్త మద్యంపాలసీ తరువాత జగన్ తత్వం బయటపడింది. ఎప్పుడు చూడని, తాగని దరిద్రపు జే బ్రాండ్లను తీసుకువచ్చారు. వాటిని జనాలకు అంటగట్టారు. అయితే ఎప్పుడూ నాలిక రుచి చూడని మందు చూసి మందుబాబులే అవాక్కయ్యారు. అయితే వాటిని తాగాలంటేనే భయపడుతున్న సమయంలో నూతన బార్ల పాలసీని జగన్ తీసుకువచ్చారు. అయితే ఆ పాలసీ ప్రభుత్వానికి వ్యాపారులకు లాభంగా ఉండే తప్ప మందుబాబులకు లేదు. రెండేళ్లకోసారి బార్లకు అనుమతిచ్చేవారు. అయితే జగన్ మూడేళ్లకొకసారి అనుమతి పెంచారు. అదే ఇప్పుడు బార్ల యజమానులకు వరంగా మారగా మందుబాబులకు భారంగా మారింది.

జిల్లాలో 27 బార్లు ఉన్నాయి. రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 వరకు విక్రయాలు జరుపుకోవాలి. బార్ల వేలంలో కోట్లు పెట్టి షాపులు దక్కించుకున్నారు. ఇక్కడ మద్యం ధరలపై నియంత్రణ లేదు. అయితే వేలం ప్రకారం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాల్సి ఉంది. అయితే బార్ల యజమానులు ఎవరినైనా మేనేజ్‌చేయగల సమర్థులు. ఇక్కడ అధికారులు, రాజకీయ నేతలు మద్యం వ్యాపారులు మిక్స్ కావడంతో మందుబాబుల ఆరోగ్యం కన్నా.. ప్రభుత్వానికి మంచి పేరు కన్నా సొంత ఆదాయమే లక్ష్యంగా చేసుకుంటారు. అందుకే నిబంధనలను తుంగలో తొక్కారు. రెస్టారెంటు నడిపేవారికే బార్‌కు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో 95 శాతం బార్లకు నో రెస్టారెంట్. కేవలం బార్లకు అనుమతి తీసుకున్నారు. ఓ విధంగా చెప్పాలంటే బార్లకు ఉన్న నిబంధనలు నాలుగైదు బార్లకు తప్ప ఎక్కడా ఉండవు. జిల్లా హెడ్ క్వార్టర్ కడపలో ఉండే 11 బార్లలో బార్‌అండ్ రెస్టారెంట్ ఉండేది ఒకటి రెండు మాత్రమే. మిగతావన్నీ పేర్లకే బార్లు. అవి బెల్టుషాపులతో సమానం. ఇక్కడ బార్ అండ్ రెస్టారెంట్ అనేసరికి కిచెన్, పార్కింగ్, ఇతరత్రా నిబంధనలు అన్నీ ఉండాలి. కడపలో కొన్ని బార్లు చూస్తే కనుక బెల్టుషాపే నయం అన్నంత దరిద్రంగా ఉంటుంది. బయట నుంచి చికెన్, ఇతర త్రా తీసుకు వచ్చి రెస్టారెంటు పేరుతో మందుబాబులకు అంటగడతారు. ఇంత ఘోరంగా బార్లలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నా కూడా అధికార యంత్రాంగం అసలు పట్టించుకోవడం లేదు. నిన్నటిదాకా జగన్ ప్రభుత్వం, ఇప్పుడు కూటమి వచ్చినా కూడా పట్టించుకోని పరిస్థితి.

నో టైమింగ్స్

మద్యం వ్యాపారం అంటేనే అదో మాఫియా లాంటిదంటారు. వాళ్లు ఎవరినైనా మేనేజ్ చేస్తారంటారు. అందుకే మద్యం సిండికేట్‌పై గుర్తుంచుకునే బ్యాచ్ అధికారం మారాక పట్టించుకోదు. మద్యనిషేధంపై ఫైట్ చేసే సంఘాలు కూడా లైట్ తీసుకుంటాయి. గవర్నమెంటు మారినా కూడా మద్యం మాఫియాదే. సేమ్‌టు సేమ్ హవా నడుస్తోంది. అంటే అప్పుడు ఏం చేశామో ఇప్పుడు అదే చేస్తారంటారు. అందుకే కూటమి ప్రభుత్వం వచ్చినా కూడా మద్యం అమ్మకాల్లో తేడా లేదు. జిల్లాలో 27 బార్లు ఉంటే అవేవీ నిబంధనలు పాటించడం లేదు. పల్లెల్లో కానీ, పట్టణాల్లో కానీ ఇప్పటి దాకా 24గంటలు పేరిట అపోలో మెడికల్ షాపు ఉన్నట్లు బోర్డులు కనిపించేవి. అయితే అవి ఏ మాత్రం తెరిచి ఉంటారోతెలియదు కానీ బార్లు మాత్రం తెరిచే ఉంటాయి. ఎప్పుడు ఏం టైం అయినా మందు దొరికుద్ది మొబైల్ యుగం రాక ముందు కోడికూత అనేది దినచర్య. అయితే ఇప్పుడు కోడికూతే ఏమో కానీబార్లు తెరిచే టైం హద్దే ఉండదు. కడపలో అయితే ఎప్పుడయినా సరే మందు దొరుకుద్ది. కడపలో 11 బార్లు ఉంటే పేరుకే బార్ అండ్ రెస్టారెంటు. ఒకటి రెండు బార్లు మినహాయిస్తే మిగతా వాటన్నింటికీ నిబంధనలు నిల్. ఆర్టీసీబస్టాండు, కోటిరెడ్డిసర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్, అప్సరసర్కిల్. పొట్టిశ్రీరాములు విగ్రహం, బిల్టప్, చెన్నూరు బస్టాండు, పాతబస్టాండు, ఐటిఐ సర్కిల్, రాజంపేట బైపాస్‌లో బార్లు ఉన్నాయి. అయితే ఇక్కడ కేవలం రెండు మూడు బార్లకు మాత్రమే రెస్టారెంటు అనుమతి ఉంది. అయితే అక్కడ నిబంధనల మేరకు కిచెన్, పార్కింగ్ ఉండాలి. ఉదయం 10 నుంచి రాత్రి 11గంటల వరకు బార్లు తెరుచుకోవాల్సి ఉండగా.. బార్లన్నీ తెల్లవారుజామున 4 నుంచి ఎప్పుడు చూసినా తెరిచే ఉంటాయి. ఓ విధంగా చెప్పాలంటే అసలు మూత వేస్తేకదా అనే విధంగా ఉంది. ఇక మద్యం అమ్మకాలపై దృష్టి పెట్టాల్సిన అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో పట్టించుకోవడంలేదు.



కడపలో ఉదయం 6.30కే తెరిచిన బార్లు

ఇంటి వద్దకే ఇసుక పంపిణీ

● 19 నుంచి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బుకింగ్

● కలెక్టర్ లోతేటి శివశంకర్



వీసీ అనంతరం అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 15: ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు ఇసుక పంపిణీ పారదర్శకంగా జరగాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆన్‌లైన్ ద్వారా ఇసుక బుక్ చేసుకోవడానికి సన్నద్ధత, ఇతర అంశాలపై రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, కమిషనరు, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌లు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన వీసీలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో గంగాధరగౌడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖేష్ కుమార్ మీనా, ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడుతూ ఇసుక పంపిణీ విధానం నియమ నిబంధనల మేరకు పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ విధానం సజావుగా జరిగేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుకను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకునేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఈనెల 19వ తేదీ నుంచి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా వినియోగదారుడు ఇసుకను పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారుడు బుక్ చేసుకున్న ఇసుకను వారి ఇంటి వద్దకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారుడు సెల్‌ఫోన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకోవచ్చన్నారు. ఇసుకను బుక్ చేసుకునే విధానంపై ఈనెల 17న సచివాలయాల సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఇసుక పంపిణీ విధానంలో జాప్యం జరగకూడదన్నారు. కార్యక్రమంలో మైన్స్ అధికారులు విమలమ్మ, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, కడప ఆర్డీవో వెంకటపతి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లడ్డూ.. అ'ధర'హో..

● రూ.10,25,116లు పలికిన వేలం



గణేశ్ లడ్డుతో అక్కుల్‌గారి విజయకుమార్‌రెడ్డి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 15: పులివెందుల పట్టణంలోని మైత్రి లేఅవుట్‌లో వినాయకుడి విగ్రహం వద్ద ఆదివారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కుల్‌గారి విజయకుమార్‌రెడ్డి రూ.10,25,116లు అత్యధికంగా వేలం పాడి దక్కించుకున్నారు. పులివెందులలో మొట్టమొదటిసారి ఇంత పెద్ద మొత్తంలో వినాయకుడి లడ్డూ ధర పలకడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉత్సవ సమితి నిర్వాహకులు లడ్డుతో పాటు స్వామివారి శేష వస్త్రం అందించి సత్కరించారు. వేలం పాటలో దక్కించుకున్న లడ్డూను విజయకుమార్‌రెడ్డి మేళతాళాల మధ్య అట్టహాసంగా తన ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం స్వామివారిని నిమజ్జన కార్యక్రమానికి తరలించారు.

వ్యవసాయరంగంలో రైతాంగానికి అన్ని విధాలుగా అండగా ఉంటూ వారికి భరోసా కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో భాగంగా డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇచ్చి వారిని కృషి సఖిలుగా ఎంపిక చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 37 మండలాలకు 105 మంది కృషి సఖిలకు శిక్షణ ఇచ్చేందకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఒక్కో మండ లం నుంచి ముగ్గురు చొప్పున కృషి సఖిలను ఎంపిక చేశారు. వీరికి జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. వీరిలో కొంత మందికి ఈ ఏడాది జూన్ 18న కలెక్టర్ విజయరామరాజు కడప శాసనసభ్యురాలు ఆర్.మాధవీల ద్వారా సర్టిఫికెట్ల పంపిణీ కూడా చేపట్టారు. శిక్షణ పొందిన కృషి సఖిలు క్షేత్రస్థాయిలో రైతులకు మిత్రులుగా ఉంటూ మార్గదర్శకులుగా సేవలందించడం జరుగుతుంది.

వ్యవసాయ విస్తరణకు.. కృషి సఖీలు

● జిల్లాలో వంద మందికి శిక్షణ

● రైతుకు మార్గదర్శకంగా సేవలు



ప్రకృతి వ్యవసాయం గురించి వివరిస్తూ..



కడప (ఎన్టీఆర్ సర్కిల్), సెప్టెంబరు 15: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల పట్ల వారిలో అవగాహన తీసుకురావడంలో కృషి సఖీలు ప్రధాన పాత్ర పోషించనున్నారు. తాము పొందిన అంశాల్లో ప్రధానమైన నేల ఆరోగ్య నిర్వహణ, నీటి సంరక్షణ, తెగుళ్ల నిర్మూలన తదితర అంశాలపై రైతులకు సలహాలు, సూచనలు అందించడం జరుగుతుం ది. కృషి సఖిల జ్ఞానాన్ని మరింత నవీకరించడానికి ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు సంబంధిత అనుబంధ రంగాల అనుభవజ్ఞులతో వారికి తగిన సలహాలు, సూచనలు ఇప్పించే అవకాశాలు కూడా ఉన్నాయి. రైతు సమస్యలపై దృష్టిసారించి స్థానిక వ్యవసాయ అవగాహనతో వారికి సంబంధించిన ప్రాంతాల్లో నేల రకాలు, వాతావరణ పరిస్థితులు, సాగవుతున్న పంటలు, వ్యవసాయ పద్ధతులపై నిర్దిష్ట సలహాలు రైతాంగానికి అందించడంలో కృషి సఖిలు ప్రముఖ పాత్ర పోషించడం జరుగుతుంది. భూసార పరీక్షల ఫలితంగా ఎరువుల వినియోగాన్ని రైతులకు అర్థమయ్యే విధంగా కృషి సఖిలు వివరిస్తారు. ప్రస్తుతం విచక్షణరాహితంగా రసాయనిక ఎరువులు వనియోగించడం ద్వారా నేలస్వభావంలో మార్పులు కలిగి పంట దిగుబడులు తగ్గుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా భూసార పరీక్షలు నిర్వహించి ప్రతి రైతుకు భూఆరోగ్య కార్డులను ఇచ్చేవారు. ఆ కార్డులో రైతుకు సంబంధించిన భూమి నేల స్వభావం, సూక్ష్మ లోపాలు పేర్కొనడంతో పాటు ఎటువంటి ఎరువులు ఎంత మోతాదులో వినియోగించాలనేది స్పష్టంగా ఇచ్చేవారు. అలాంటి భూసార పరీక్ష ఫలితాలను కృషి సఖిల ద్వారా రైతాంగానికి మరింత వివరణాత్మకంగా చెప్పడం జరుగుతుంది. పర్యావరణం సంరక్షించే విధంగా పంటల సాగు ప్రోత్సహించడం జరుగుతుంది. దీంతో పాటు రైతులకు అందుబాటులో ఉన్న వనరులు, నిధులను పరిగణనలోకి తీసుకుని నేల ఆరోగ్య సవాళ్లకు స్థిరమైన పరిష్కారాలను కనుగొనడం జరుగుతుంది.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కృషి సఖిల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు రైతులను ప్రోత్సహించడం జరుగుతుంది. ఇందుకనుగుణంగా ప్రకృతిలోని వనరులను ఉపయోగించి ఆవు పేడ, మూత్రంతో కలిసి చేసే వ్యవసాయాన్ని రైతులకు వివరించనున్నారు. ఇప్పటికే రైతులు చాలా వరకు వ్యవసాయం మీద అధిక మొత్తంలో ఖర్చు పెడుతున్నారు. పెట్టుబడి కంటే ఆదాయం తగ్గడంతో రైతులు నష్టపోతున్నారు. రసాయన ఎరువుల వినియోగం కూడా ఎక్కువగా వాడడం వల్ల భూమి ఆరోగ్యం దెబ్బతింటుంది. అటువంటి భూమిలో సాగు చేసిన పంట ఉత్పత్తుల ద్వారా కూడా వినియోగదారులకు అనారోగ్యాలు, రోగాలు ఎక్కువ అవుతున్నాయనేది స్పష్టమవుతుంది. వీటన్నింటినీ తగ్గించేందుకు ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం తప్పకుండా చేయాల్సిన అవసరం ఉందనే విధంగా కృషి సఖిలు రైతాంగానికి వివరిస్తున్నారు. దీంతో పాటు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూసారం పెరగడం, పంటల సాగులో ఖర్చులు తగ్గడం, దిగుబడి పెరగడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులు రావడం వల్ల మార్కెట్లో మంచి ధర వచ్చే అవకాశాలు కూడా ఉంటాయి. దీని వల్ల రైతుకు ఆదాయం పెరగడంతో పాటు వినియోగదారులకు కూడా మంచి ఆరోగ్యం అందుతుందనేది ప్రభుత్వ ఆలోచన. ప్రకృతి వ్యవసాయంలో 365 రోజులు పంట సాగు చేసే అవకాశాలున్నాయి. 20 రకాల విత్తనాలతో అనేక పంటల చుట్టూ రక్షణ పంట వేసే విధానం రైతాంగానికి వివరించనున్నారు. ఈ మేరకు కృషి సఖిలు నిష్ణాతులైన వ్యవసాయశాస్త్రవేత్తలు, అనుభవజ్ఞులతో ఇప్పటికే శిక్షణ పొందడం జరిగింది. కేవలం పొదుపుతోనే కాకుండా డ్వాక్రా సంఘాల మహిళల ద్వారా రైతాంగానికి అనేక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కృషి సఖిలను ఏర్పాటు చేసి వారికి ప్రతి నెలా గౌరవ వేతనం ఇస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ విస్తరణ పనుల్లో కృషి సఖిల పాత్రను మరింత ఇనుమడింపజేసేందుకు డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పులివెందుల నియోజకవర్గంలో బెరైటీస్ గనులపై వైసీపీ, టీడీపీ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మా ప్రభుత్వం వచ్చింది గనులు మావని టీడీపీ అంటే... కాదు ఎప్పటి నుంచో ఇవి మావేనని వైసీపీ పట్టుబడుతోంది. ఇప్పటికే గనుల్లో తవ్వకాలు నిర్వహిస్తున్న వారిని టీడీపీ అడ్డుకొని ఆపేసింది. మాదంటే మాదని ఇరువర్గాలు బలగాల మోహరింపు వరకు వెళ్లింది. బెరైటీస్ తవ్వకాలపై ఇరుపార్టీలు తీవ్రంగా పేచీ పడుతున్నాయి.

బెరైటీస్ తవ్వకాలపై పేచీ

● టీడీపీ.. వైసీపీ మధ్య తీవ్రపోటీ

● మాదంటే మాదని బలగాల మోహరింపు

● ఆగిన తవ్వకాలు

(కడప-ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రాంతంలో ఉన్న బెరైటీస్ గనులపై ఇప్పటి వరకు వైసీపీ ఆధిపత్యం కొనసాగించింది. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే టీడీపీ ఆధిపత్యం కొనసాగించాలని ఉవ్విళ్లూరుతోంది. నియోజకవర్గంలో అనుమతి ఉన్నవి లేనివి దాదాపు 35 బెరైటీస్ గనులు ఉన్నాయి. ఇందులో లీజు ఉన్నవారు, లేనివారు వారి స్థాయిలో తవ్వకాలు నిర్వహిస్తూ లాభాలు గడిస్తున్నారు. ముఖ్యంగా వేముల మండలంలో బెరైటీస్ గనులు అధికంగా ఉన్నాయి. వేముల మండలంలో వైసీపీకి చెందిన ఓ నాయకుడు టిఫెన్ కంపెనీకి చెందిన బెరైటీస్ గనులను తన ఆధీనంలో ఉంచుకుని తవ్వకాలు సాగిస్తూ వచ్చారు. ఇటీవల టీడీపీ ప్రభుత్వం వచ్చిన అనంతరం పులివెందుల నియోజకవర్గ స్థాయి నాయకుడు, మరో ఇద్దరు వేముల మండల నాయకులు ఆ బెరైటీస్ గనులపై దృష్టి సారించారు. ప్రస్తుతం తవ్వకాలు సాగిస్తున్న వారందరిని ఆపేసి వెళ్లిపోవాలని హుకుం జారీ చేశారు. దీనితో లీజు ఉన్నవారు, లేనివారు ఎక్కడ పనులు అక్కడ ఆపేశారు. ఐదురోజుల క్రితం వేముల వైసీపీ నాయకుడు ఈ బెరైటీస్ గనులపై తమదే పెత్తనమంటూ పట్టుబట్టారు. దీనితో టీడీపీకి చెందిన నాయకులు మీ ప్రభుత్వం ఉన్నప్పుడు తవ్వకాలు సాగించారు, మా ప్రభుత్వం వచ్చినపుడు మేము తవ్వకాలు సాగిస్తామని తెగేసి చెప్పారు. టిఫెన్ కంపెనీ తవ్వకాలకు అనుమతి ఇచ్చిందే గతంలో టీడీపీ ప్రభుత్వమేనని అవి తమ ఆధీనంలో ఉండాలని టీడీపీ నేతలు పట్టుబట్టారు. దీంతో ఇరుపార్టీలు వారివారి బలగాలను దాదాపు రెండువందల మందికి పైగా మోహరించి ఘర్షణకు దిగేందుకు సిద్ధమయ్యారు. పోలీసులు కలుగజేసుకుని అందరినీ శాంతింపజేశారు.

ఇరుపార్టీల నాయకుల మధ్య బెరైటీస్ గనులు మావంటే మావనే పేచీ మాత్రం ఆగలేదు. ఎవరి స్థాయిలో వారు తవ్వకాల కోసం ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు. లీజు ఉన్న యజమానులను కూడా తవ్వకాలు చేయవద్దని చెప్పడంతో ఇదెక్కడి న్యాయమని వారు బహిరంగంగానే ఇరు పార్టీల నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కావాలంటే అనుమతులేని వాటిపై ఏదైనా పెత్తనం చెలాయించుకోవాలని అన్ని అనుమతులు ఉన్న తమపై పెత్తనం ఏమిటని వాపోతున్నారు. కేవలం డబ్బు ఆర్జనే ధ్యేయంగా అక్కడి నాయకులు బెరైటీస్ గనులపై లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని సాక్షాత్తు పులివెందుల ప్రజలే అంటున్నారు. వైసీపీకి చెందిన వేముల మండల నాయకుడు గనుల ఆధిపత్యాన్ని కొనసాగించాలని చూస్తుంటే.. అధికారం కోల్పోయినా వారి పెత్తనం ఏమిటని టీడీపీ వారు ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా బెరైటీస్ తవ్వకాలతో పులివెందుల ప్రాంతంలో పెద్ద దుమారమే రేపుతోంది. అక్కడ సాగుతున్న బెరైటీస్ తవ్వకాలతో కోట్లు కొల్లగొడుగుతున్నారన్నది అందరికీ తెలిసిన విషయమే.



వేముల మండలంలో బయటకు తీసిన బెరైటీస్

కంప్యూటర్ ఆపరేటర్ మరో రూ.3 లక్షలు స్వాహా

చాపాడు, సెప్టెంబరు 15: ఎంపీడీఓ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ హానిక్‌బాష మరో రెండు గ్రామ పంచాయతీలకు చెందిన రూ.3.3 లక్షలు స్వాహా చేసినట్లు అధికారులు తెలిపారు. వెదురూరు పంచాయతీ నుంచి రూ.2.78 లక్షలు, పల్లవోలు నుంచి రూ.25 వేలు, ఇతర బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు తెలిసింది. ఇప్పటికే భద్రిపల్లె పంచాయతీ నుంచి రూ.2.54 లక్షలు స్వాహా చేశారు. 2024 జనవరి నుంచి విడతల వారీ డబ్బు డ్రా చేసినట్లు అధికారులు గుర్తించారు. మూడు పంచాయతీలకు సంబంధించి మొత్తం రూ.5.57 లక్షలు స్వాహా చేశారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బు గోల్‌మాల్ జరిగినా అప్పటి ఎంపీడీఓ రంతులయ్యగానీ, ఈఓపీఆర్‌డీ క్రిష్ణవేణి గానీ పట్టించుకోలేదు. హానిక్‌బాష సౌదీ అరేబియా దేశానికి వెళ్లేందుకు పాస్‌పోర్టుకోసం దరఖాస్తు చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడును వివరణ కోరగా హానిక్‌బాష వెదురూరు, పల్లవోలు పంచాయతీల నుంచి రూ.3.3 లక్షలు స్వాహా చేసిన విషయం నిజమేనన్నారు. పల్లవోలుకు సంబంధించి రూ.25 వేలు రికవరీ చేశామన్నారు. ఇతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మైలవరానికి 7,500 క్యూసెక్కుల విడుదల

కొండాపురం, సెప్టెంబరు 15: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి నీటి విడుదలను ఆదివారం 5000 నుంచి 7,500 క్యూసెక్కులకు పెంచినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీటిమట్టం స్థిరంగా ఉండేలా అనుబంధ జలాశయాలకు నీటిని పంపుతున్నట్లు డీఈ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 10,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఆయన తెలిపారు. సీబీఆర్‌కు 1500 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పెన్నానదికి కొనసాగుతున్న నీటి విడుదల



మైలవరం, సెప్టెంబరు 15: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 4 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు మైలవరం జలాశయ ఏఈఈ గౌతమ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. గండికోట జలాశయం నుంచి 7500 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో ఉండగా పెన్నాకు 4 వేల క్యూసెక్కులు, ఉత్తర కాల్వకు 80 క్యూసెక్కులు, దక్షిణ కాల్వకు 90 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. గండికోట నుంచి మైలవరానికి మరింత నీరు ఇన్‌ఫ్లో పెరిగితే పెన్నానదికి నీటి విడుదల మరింత పెంచుతామని పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. మైలవరం జలాశయ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.5 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న కారు

● కరెంటు సరఫరా లేక తప్పిన ప్రాణనష్టం


ప్రధాన రోడ్డు పక్కన స్తంభాన్ని ఢీకొన్న కారు

జమ్మలమడుగు, సెప్టెంబరు 15: కోవెలకుంట్ల రోడ్డు ఎస్.ఉప్పలపాడు గ్రామ సమీపాన రైల్వే ట్రాక్ దగ్గర ఆదివారం కారు కరెంటు స్తంభాన్ని ఢీకొంది. ఐదుగురు స్నేహితులు కర్నూలు జిల్లా డోన్ ఎల్లుర్తి నుంచి కారులో జమ్మలమడుగు మీదుగా ప్రొద్దుటూరుకు వెళుతున్నట్లు వారు తెలిపారు. కారు అదుపు తప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టిన ఘటనలో విద్యుత్తు స్తంభం విరిగి కారుపై పడింది. కరెంటు తీగెలు కొంచెం ఎత్తులో ఉండడం వలన విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని స్థానికులు తెలియజేశారు. అదే దారిలో వెళుతున్న కొందరు విద్యుత్తు అధికారులకు సమాచారం ఇచ్చి కరెంటు సరఫరా లేకుండా నిలిపివేశారు. దీంతో కారులో ఉన్న ఐదుగురు బయటకు వచ్చి తమ అదృష్టం దేవుడు కాపాడాడని, లేనిచో పూర్తిగా దగ్ధమయ్యేదని వారు తెలిపారు. ఏది ఏమైనా ప్రాణనష్టం తప్పింది.

పెండింగ్ పీఎఫ్, ఏపీజీఎల్ఐ వెంటనే చెల్లించాలి

- ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 15: ఉపాధ్యాయుల జీతాల నుంచి దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ తుది చెల్లింపులు ఆరునెలలుగా చేయకపోవడం దారుణమని ఎసీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఎర్రగుంట్లలో రీజనల్ కన్వీనర్ అన్వర్ బాషా అధ్యక్షతన ప్రాంతీయ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.21వేల కోట్లకు పైగా ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సి ఉందన్నారు. వీటిపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. 12వ పీఆర్సీ ఆలస్యం అవుతున్నందున వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రమణారెడ్డి, బాలగంగిరెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు అంశంపై ప్రభుత్వం స్పందించాలని, ఉద్యోగుల భాగస్వామ్యం లేని పెన్షన్ విధానాన్ని తప్ప మరే ప్రత్యామ్నాయాన్ని ఉపాధ్యాయ సంఘాలు అంగీకరించవన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో ఉపాధ్యాయులను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్, సంగమేశ్వరరెడ్డి మాట్లాడుతూ 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 ఏళ్ల ఉద్యోగ విరమణ వయసు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, వీఎన్‌పల్లె, కమలాపురం మండలాల జిల్లా ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు ఎస్.దాదాపీర్, శంకర్‌రెడ్డి, కుండా భాస్కర్, హెచ్‌ఎంలు ఎస్.రామాంజనేయరెడ్డి, సాంబశివారెడ్డి, సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏ.సుకుమార్, ప్రతాప్‌రెడ్డి, విశ్రాంత డిప్యూటీ డీఈఓ మునిరెడ్డి పాల్గొన్నారు.

పత్తి రైతుకు పురుగు భయం

ఎకరాకు రూ.40 వేలు ఖర్చు ● అనుకూలిస్తే లాభమే
తగ్గిన పత్తి సాగు ● రైతుకు అధికారులు సలహాలు ఇవ్వాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 15: పత్తి రైతుకు పురుగు భయం పట్టుకుంది. మోరగుడి, గొరిగెనూరు, అంబవరం, పొన్నతోట, మైలవరం మండలం దొమ్మరనంద్యాల, వేపరాల, చిన్నకొమెర్ల, పెద్దకొమెర్ల తదితర ప్రాంతాల్లో రైతులు పత్తి పైరు అధికంగా సాగు చేస్తారు. ప్రతి రైతు ఎకరాకు సుమారు రూ.40 వేల దాకా పెట్టుబడులు పెడతారు. ప్రస్తుతం పత్తి పైరును రేగ్గాయ పురుగు ఆశించి కాయను తినేస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాలకు వ్యవసాయాధికారులు రావడంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కిలో పత్తి రూ.76 నుంచి రూ.80 వరకు ధర పలుకుతుండడంతో తెగుళ్లను తట్టుకుని పూర్తి దిగుబడి సాధిస్తే లాభాలు కళ్లచూడవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు పైరును పరిశీలించి, పురుగు బారినుంచి పంటను రక్షించుకునేందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.


సాగు చేసిన పత్తి పంట

శెట్టిపల్లె హైస్కూల్‌కు రాజకీయ గ్రహణం

● రూ.64 లక్షలు నాడు- నేడు నిధులు వెనక్కి
● మౌలిక వసతులకు విద్యార్థులు దూరం
● కూటమి ప్రభుత్వంతో వసతులు సమకూరేనా


మురుగును తలపిస్తున్న పాఠశాల ఆవరణ

సంబేపల్లె, సెప్టెంబరు 15: వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రవేశపెట్టిన నాడు-నేడు పనులు నిర్వీర్యమై మంజూరైన రూ.64 లక్షల నిధులు మురిగిపోయాయి. రాజకీయ కారణాలతో విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక వసతులు కల్పించలేదు. ఫలితంగా నిత్యం విద్యార్థినీ, విద్యార్థులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతమైన శెట్టిపల్లి జడ్పీహైస్కూల్‌లో 161 మంది పేద విద్యార్థులు చదువుతున్నా వారికి సరైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని చెప్పవచ్చు. వివరాల్లోకెళితే....

శెట్టిపల్లి జడ్పీహైస్కూల్‌లో 161 మంది పేద విద్యార్థులు చదువుతున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వైసీపీ ప్రభుత్వంలో మౌలిక వసతుల కింద నాడు- నేడు నిధులు రూ.64 లక్షలు మంజూరు చేశారు. రాజకీయ కారణాలతో విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక వసతులు కల్పించలేదు. వైసీపీ ప్రభుత్వంలో పాఠశాల స్కూల్ కమి టీ చైర్మెన్ టీడీపీ వ్యక్తి కావడంతో వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఖర్చు చేయకుండా వదిలేశారు. దీంతో నిధులు వెనక్కిపోయాయి. పాఠశాలలో విద్యార్థులు కనీస వసతులు లేక రోజూ అవస్థలు పడుతున్నారు.

పాఠశాలలో నెలకొన్న సమస్యలు

పాఠశాల చుట్టూ ప్రహరీ లేదు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. వర్షం వస్తే తరగతి గదులు ఉరుస్తున్నాయి. తలుపులు, కిటికీలు కూడా సక్రమంగా లేవు. పాఠశాలలో తాగునీటి సమస్య నెలకొంది. వంట గదులు, గోడల వరకు కట్టి వదిలేశారు. మొండి గోడలు పిచ్చిమొక్కల మధ్య ఆరుబయట వంట చేస్తున్నారు. మురుగు కాల్వల ద్వారా వచ్చే నీరు పాఠశాల ప్రాంగణంలో చేరి మడుగును తలపిస్తున్నాయి. విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలం లేదు. బాలికలకు మరుగుదొడ్లు లేక ఆరుబయట అవస్థలు పడుతున్నారు. మూడో తరగతి నుంచి 10వతరగతి వరకు ఉన్న బాలికలు మరుగుదొడ్డిని కూడా సక్రమంగా లేక వినియోగించుకోవడం లేదు. పాఠశాలలో అన్నీ సమస్యలే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా విద్యార్థుల కనీసం మౌలిక వసతులు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

నిధులు వెనక్కిపోయాయి

పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనలు అందిస్తున్నాం. ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలంటే కనీసం నిధులు కూడా లేవు. నాడు- నేడు నిధులు 64 లక్షల వెనక్కిపోయాయి. ప్రస్తుతం నిధులు మంజూరైతే విద్యార్థులకు వసతులు కల్పిస్తాం.

- చిన్నరెడ్డెప్ప, హెచ్‌ఎం, శెట్టిపల్లి

విద్యార్థులు అవస్థలు పడుతున్నారు



మారుమూల ప్రాంతం నుంచి వచ్చే ఆడపిల్లలు మరుగుదొడ్లు లేక ఆరుబయట వెళుతున్నారు. పిల్లల భద్రత లేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వంలో నాడు- నేడు కింద మంజూరైన నిధులను తిరిగి మంజూరు చేయాలి. పిల్లల సమస్యలు స్థానిక నేతలతో కలిసి మంత్రి దృష్టికి తీసుకెళ్తాం. పాఠశాలకు వసతులు కల్పిస్తాం.

- బాషావల్లి, స్కూల్ కమిటీ చైర్మెన్, శెట్టిపల్లి


డోరు కూడా సక్రమంగా లేని మరుగుదొడ్డి


పిచ్చిమొక్కలతో ఉన్న పాఠశాల ప్రాంగణం


ఆరుబయటే వంట చేస్తున్న దృశ్యం

కొత్త ఆవిష్కరణలకు ప్రసిద్ధి జీనోమిక్స్ బయోటెక్

● ప్రొఫెసర్ రత్నగిరి పోలవరపు



అవార్డును అందుకుంటున్న శాస్త్రవేత్త డాక్టర్ వినయ్‌చంద్

పులివెందుల టౌన్, సెప్టెంబరు 15: ఆరోగ్య సంరక్షణ మెరుగుదల కోసం వినూత్న ఆవిష్కరణలను జీనోమిక్స్ బయోటెక్ ద్వారా అందిస్తున్నామని జీనోమిక్స్ ప్రెసిడెంట్ సీఈఓ రత్నగిరి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మేం ఐవీఆర్ఐ వారితో కలిసి కోళ్లవ్యాధులపై చేసిన పరిశోధనలకు బీఐఆర్ఏసీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ భారత ప్రభుత్వ ఇన్నోవేటర్ అవార్డును ఇచ్చారన్నారు. ఈ అవార్డును డీబీటీసీ సెక్రటరీ రాజేశ్ సుధీర్ గోఖలే చేతుల మీదుగా అందుకున్నందుకు గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో మా జీనోమిక్స్ బయోటెక్ ద్వారా మరిన్ని పరిశోధనలు చేస్తామన్నారు. 2003లో జీనోమిక్స్ బయోటెక్ అత్యాధునిక పరిశోధన కేంద్రాన్ని స్థాపించామన్నారు. నాటి నుంచి మేంజీనోమిక్స్ మాలిక్యులర్ డయాగ్నోస్టిక్ ప్రైవేటులిమిటెడ్, జీనోమిక్స్ హెల్త్ కేర్ ఆఫ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ జెనోమిక్స్ కార్ల్ ప్రైవేటు లిమిటెడ్ వంటివి ప్రభుత్వ ప్రైవేటు సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. పశువుల ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు ఏపీ ప్రభుత్వంతో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా పులివెందులలో జీనోమిక్స్ కార్ల్ ప్రైవేటు లిమిటెడ్ ఏర్పాటు చేశామన్నారు. మా పరిశోధన కేంద్రం మానవ ఆరోగ్య అవసరాలకు సంబంధిత వ్యాధిని గుర్తించే కిట్లను కూడా అందిస్తుందన్నారు. మరీముఖ్యంగా మలేరియా, డెంగ్యు, హెచ్‌ఐవీ, హెచ్‌సీవీ సహా జంతువుల ఆరోగ్య అవసరాలకు సంబంధించిన బ్రూసెల్లోసిస్, టిబా, ఫుట్‌అండ్ మౌత్ డిసీస్ వంటి వ్యాధి నిర్ధారణ కిట్లను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. 2018లో ఎన్ఆర్‌సీఈ వారి సహకారంతో దేశంలోనే ఏకైక గ్లాండర్స్ వ్యాధి నిర్ధారణ కిట్ కనుక్కున్నామన్నారు. కరోనా సమయంలో కూడా వ్యాధి నిర్ధారించడానికి కావలసిన కిట్లను అభివృద్ధి చేసి కర్నూలులో ల్యాబ్ ఏర్పాటు చేసి అప్పటి ఏపీ ప్రభుత్వానికి సహకరించిందన్నారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన జనాభాకు మా పరిశోధన కేంద్రం మద్దతు ఇస్తుందన్నారు. భవిష్యత్తులో జీనోమిక్స్ బయోటెక్ పరిశోధన కేంద్రం ద్వారా ప్రజా పరిరక్షణకు దోహదపడతామని తెలిపారు. ఈ సందర్భంగా అవార్డును అందిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థినితో ఉపాధ్యాయురాలు

వల్లూరు, సెప్టెంబరు 15: ఎస్‌జీఎఫ్ అండర్ 19 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి క్యారంబోర్డ్ పోటీల్లో ఏపీ మోడల్ స్కూలు, కాలేజీ విద్యార్థిని కె.కీర్తన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఆదివారం కడప జూనియర్ గర్ల్స్ కాలేజీలో జిల్లాస్థాయి క్యారంబోర్డు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూలులో ఇంటర్ చదువుతున్న కె.కీర్తన మొదటిస్థానం సాధించింది. మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు, పీఈటీ సుశీలమ్మ, విద్యార్థినిని అభినందించారు.

కరెంటు వైరు తగిలి బాలిక మృతి

కడప, క్రైం,సెప్టెంబరు 15: కడప నగరం సరోజిని నగర్‌లో ఆదివారం కరెంట్ వైరు తగిలి యాగంటి అల్లిక (11) మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. సరోజినీనగర్ చెందిన యాగంటి అల్లిక 6వతరగతి చదువుకుంటోంది. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లడంతో మధ్యాహ్నం మోటార్ వేస్తుండగా కరెంటు వైరు తగిలి చనిపోయినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎంఆర్‌పీఎస్‌నేతపై బెదిరింపుల కేసు నమోదు

ప్రొద్దుటూరు,సెప్టెంబరు 15: ఎంఆర్‌పీఎస్ నేత సుధాకర్ మాదిగ మరికొందరిపై బెదిరిస్తూ దాడికి యత్నించడంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే 14వతేదీ శనివారం సాయంత్రం శ్రీనివాసనగర్‌లోని తెల్లాకుల మనోహర్ అనే లోక్‌సత్తా నేత ఇంటి దగ్గరికి ఎంఆర్‌పీఎస్ నేత సుధాకర్ మాదిగ, మరికొందరు వెళ్ళి తాత్కాలిక కూరగాయల మార్కెట్ వద్ద పెద్దమ్మ గుడి పేరుతో మున్సిపల్ స్థలాలు ఆక్రమించారని పెట్టిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని ఇంట్లోకి వెళ్లి బెదిరించారు. అంతేకాకుండా దాడికి యత్నించారని మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ప్రాణాంతకంగా ఇసుక గుంతలు

పెన్నానదిలో పెరుగుతున్న ప్రవాహం ● విచ్చలవిడిగా నదిలోకి వెళ్తున్న ప్రజలు


పడమరవైపు పెన్నానదిలో ప్రవహిస్తున్న వరదనీరు

జమ్మలమడుగు, సెప్టెంబరు 15: మైలవరం జలాశయం నుంచి నీరు విడుదల చేస్తుండడంతో పెన్నానదిలో ఇసుక గుంతలున్న వేపరాల, దొమ్మరనంద్యాల, మోరగుడి, జమ్మలమడుగు, పొన్నతోట, గూడెం చెరువు, రాజీవ్ నగర్ కాలనీ, అంబవరం, గొరిగెనూరు తదితర ప్రాంతీయులకు ప్రమాదకరంగా మారింది. నదిలోకి నీరు వస్తుండడంతో ఆయా ప్రాంతీయులు అప్రమత్తంగా ఉండాలని పది రోజుల కిందట మైలవరం ఇరిగేషన్ శాఖ అధికారులు, పోలీసులు హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో విద్యార్థులు, ఇతరులు ద్విచక్ర వాహనాలతో పెన్నానదిలోకి వెళుతున్నట్లు తెలుస్తోంది. గతంలో పెన్నానదిలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు ప్రమాదానికి గురయ్యారు. మూడు రోజుల నుంచి పాఠశాలలకు సెలవులు రావడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున నదిలోకి వెళుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వారు ప్రమాదాల బారిన పడకుండా వంతెన వద్ద, గ్రామాల సమీప నది వద్ద గ్రామ సేవకులు, పోలీసు సిబ్బందిని నియమించి పెన్నానదిలోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



తూర్పు భాగాన ప్రవహిస్తున్న మైలవరం వరదనీరు - ప్రమాదకరంగా ఇసుక గుంతలు

వంకలో దిగి యువకుడు మృతి



మైదుకూరు,సెప్టెంబరు 15: శివపురం వాసి దివ్యాంగుడు గారెల నరసింహ్మ (17) పశువుల మేపు కోసం గ్రామం వెలపల బీడు పొలాల్లో పశువులను మేపుకొంటుండేవాడు. మేపు తిన్న పశువులు నీటి కోసం వంకలో దిగగా వాటితో పాటు వంకలో దిగిన నరసింహ్మ బురదలో కూరకుపోయి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వంక నుంచి మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పీటీసీ డీఎస్పీగా అబ్దుల్‌కరీం

కడప (క్రైం), సెప్టెంబరు 15: జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటరు డీఎస్పీగా ఎస్‌కే అబ్దుల్ కరీంను నియమిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన వెయిటింగ్‌లో ఉండగా ఆయనకు పోస్టింగ్ కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 47 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. కొన్ని నెలలుగా కడప డీఎస్పీ ఖాళీగా ఉంది. కడప ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్న గిరిధర్‌ను తిరుపతి ఎస్పీకి బదిలీ చేశారు.

మట్టివినాయకుడి నిమజ్జనం



కడప (కల్చరల్) సెప్టెంబరు 15: వినాయక చవితి పర్వదినం సందర్భంగా నగర కో-ఆపరేటివ్ కాలనీలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడికి తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్వాహకులు ఆదివారం నిమజ్జనానికి తరలించారు. 40 ఏళ్లగా కమిటీ పెద్దలు అత్యంత భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలను నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం స్వామివారిని ట్రాక్టర్‌పై వుంచి కాలనీలోని పలు ప్రాంతాల్లో ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారికి వీడ్కోలు పలికారు.

మెలకువలతోనే తైక్వాండోలో సత్తా


తైక్వాండో పోటలలో పాల్గొన్న క్రీడాకారులు

కడప (స్పోర్ట్స్), సెప్టెంబరు 15: శిక్షణలో మెలకువలు నేర్చుకోవడం ద్వారా తైక్వాండో పోటీలలో సత్తా చాటొచ్చని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గీత, విజయభాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ క్రీడలో అయినా ప్రతిభ చూపడం వల్ల దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు, అలాగే సొంత ఊరికి పేరు తెచ్చినవారవుతారన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుడ్యానికి ఎంతగానో దోహదపడగలన్నారు. కావున క్రీడల్లో పాల్గొనాలన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కె. వెంకటేష్, రాజశేఖర్, రేవంత్‌రెడ్డి, ఫాజిల్‌బాష, వంశీ, శ్రీక్రిష్ణ వ్యవహరించారు.

'మరుగుదొడ్ల ఫొటోలు ఎస్ఎంసీకి వద్దు'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 15: పాఠశాలల్లోని మరుగుదొడ్ల ఫొటోల బాధ్యత ఎస్ఎంసీ సభ్యులకు వద్దని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్ డిమాండ్ చేశారు. కూలి చేసుకునే వారు ఎక్కువ సంఖ్యలో ఎస్ఎంసీ సభ్యులుగా ఉన్నారని, వారి ఉపాధికి ఆటంకం కలిగే అవకాశం ఉన్నందున వీటిని తొలగించాలని కోరారు.

ఇంజనీర్లు విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి


పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న గోవర్ధనరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 15: ప్రతి ఇంజనీరు అంకితభావంతో పనిచేస్తూ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని కడప ఆఫీసర్స్ క్లబ్‌లో ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య చిన్నప్పుడే ఎన్నో కష్టాలు అనుభవించారన్నారు. విద్యపట్ల ఆసక్తితో ఇంజనీరు చదివి వివిధ హోదాల్లో పని చేస్తూ వివిధ ప్రాజెక్టులకు రూపకల్పన చేసి వాటిని త్వరితగతిన పూర్తిచేసిన అపర భగీరథుడన్నారు. ఆయన ప్రతిభ వల్ల దేశం గర్వపడేలా చేశారన్నారు. వివిధ యూనివర్సిటీల ద్వారా ఎనిమిది సార్లు గౌరవ డాక్టరేట్ పొందిన మేధావి మోక్షగుండం అన్నారు. ప్రభుత్వం కూడా ఉత్తమ ప్రతిభకనబరిచిన ఇంజనీర్లను గుర్తించి వారిని సత్కరించాలన్నారు. ఇంజనీర్లు ప్రగతి రథ సారధులని, వివిధ నిర్మాణాల్లో నాణ్యత పాటిస్తూ నిర్దేశిత గడువు లోపు తమ పనులు చేసి సమాజానికి మేలు చేసినవారవుతారన్నారు. విద్యుత్ శాఖ రిటైర్డ్ ఇంజనీరు ప్రతాప్ రెడ్డి, పంచాయతీ రాజ్‌ఎస్ఈ రామచంద్రారెడ్డి, క్రిష్ణమూర్తి, కేశవులు, హబీబ్ ఇంజనీరర్లను సత్కరించారు. అలాగే క్లబ్ సభ్యులు జానమద్ది విజయభాస్కర్, లేబాక మధుసూదనరెడ్డి, సుబ్బరామయ్య, సోమిరెడ్డి, శ్రీరామరెడ్డి, నాగిరెడ్డి, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రఖ్యాత ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 15: భారతదేశంలో ప్రఖ్యాత ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ అన్నారు. ఆదివారం స్థానిక విద్యుత్‌భవన్‌లో ఇంజనీర్స్‌డే సందర్భంగా ప్రఖ్యాత సివిల్ ఇంజనీరు అయిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న మొదటిసారిగా ముంబైయ్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా చేరారన్నారు. హైదరాబాదును సుందరనగరంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదేనన్నారు. ఏ పని అప్పగించినా ఆ పనిని ఒక తపస్సుగా చేపట్టేవారన్నారు. అనంతరం విశ్వేశ్వరయ్య సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విశ్వేశ్వరయ్యకు నివాళి

జేకే జనం కోసం ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు లయన్ పఠాన్ ఖాదర్ బాషా ఆదివారం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఎల్ఐసీ సర్కిల్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మన జిల్లాలో కూడా ఎంతోమంది ప్రతిభ ఇంజనీర్లు ఉన్నారన్నారు. ఎంతో మందికి ఆదర్శప్రాయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అబ్దుల్ రాయల్ కరీముల్లా పాల్గొన్నారు.

ఇంజనీర్లకు జేజేలు: ఆర్టీయూ

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 15 : మనసులో నిర్మాణపరమైన ఏదైనా ఆలోచన వస్తే దానిని నిర్మించి వారి కలలను సాకారం చేయడమే ఇంజనీర్ల నైపుణ్యం. ప్రపంచ వ్యాప్తంగా నిర్మాణరంగం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోందంటే దానికి ఇంజనీర్ల సృజనాత్మక కృషేనని రాయలసీమ ట్రేడ్ యూనియన్ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడగలం ప్రసాద్ అన్నారు. ఆదివారం ఇంజనీర్ల దినోత్సవ సందర్భంగా కడప ఎల్ఐసీ సర్కిల్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇంజనీర్ల పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి


మోక్షగుండం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఇంజనీర్ వెంకటరమణ, టీడీపీ, బీజేపీ నేతలు

వేంపల్లె, సెప్టెంబరు 15: ఇంజనీర్లకు పితామహుడైన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి భవనంలో ఆదివారం ఏఈ వెంకటరమణ, టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గాలి హరిప్రసాద్, దొంతు సుమన్ తదితరులు మోక్షగుండం విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఆయన సేవల గురించి కొనియాడారు. ఎన్నో నిర్మాణాలను చేపట్టి ఇంజనీర్లకు ఆదర్శప్రాయుడుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో నామా వేమకుమార్, మల్లికార్జున, పసుపులేటి శ్యామ్, నరేంద్రబాబు, దేవ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో...

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డైరెక్టర్ గుప్త, ఏఓ రవికుమార్, ప్రొఫెసర్ దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై పోరుకు ముందుండాలి

● ఏపీయూడబ్ల్యుజే జిల్లా నూతన కమిటీ ఎన్నికలో రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి


మోపూరి బాలక్రిష్ణారెడ్డి, అధ్యక్షుడు


శ్రీనివాసులు, కార్యదర్శి

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 15: జర్నలిస్టుల సమస్యలపై పోరు సాగించేందుకు పాత్రికేయులు ముందుండాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యుజే) రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యుజే జిల్లా నూతన కమిటీ ఎంపిక ప్రక్రియ ఏకగ్రీవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి పి.రామసుబ్బారెడ్డి నేతృత్వం వహించగా జిల్లా వ్యాప్తంగా గల జర్నలిస్టులు హాజరయ్యారు. కాగా ఎన్నికల అధికారులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు రామాంజనేయరెడ్డి, శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనమన్నారు. ప్రధానంగా జిల్లాలోని జర్నలిస్టుల న్యాయమైన సమస్యల పరి ష్కారానికి నూతన కమిటీ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా మోపూరి బాలకృష్ణారెడ్డి (సాక్షి బ్యూరో), కార్యదర్శిగా శ్రీనివాసులు (ఏబీఎన్ బ్యూరో), గౌరవ అధ్యక్షుడిగా వెంకటరెడ్డి (సాయంకాలం ఎడిటర్), ఉపాధ్యక్షుడిగా గంగవరం వెంకట శివారెడ్డి (ఆంధ్రజ్యోతి), సలహాదారులుగా పి.విశ్వప్రసాద్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, కోశాధికారిగా నరసింహ (ఆంధ్రప్రభ) ఎన్నికయ్యారు.

హనుమంత వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్, సెప్టెంబరు 15: పులివెందులలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలు పూజ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి భూ దేవి సమేత శ్రీరంగనాథుడు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, ఆకు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి క్రిష్ణరాజేశ్‌శర్మ ఉప అర్చకులు రాజసింహ, భూపాల్‌శర్మ, ఫణిశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. ఆలయ ఈఓ కొట్టె వెంకటరమణ నే తృత్వంలో భక్తులకు అవసరమైన సదుపాయలు సమకూర్చారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

సంప్రదాయ కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు

పట్టణంలోని ఆర్యవైశ్యులు నూలుపూజ ఉత్సవాల్లో భాగంగా ఆనవాయితీ ప్రకారం తమకుటుంబ సభ్యులతో కలిసి వచ్చి స్వామివారిని దర్శించుకుని అనంతరం ఇతర సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నూలుపూజలో అనాదిగా పులివెందులవాసులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి స్వామివారిని దర్శించుకుని అల్పాహారాన్ని ఆరగించడం ఆనవాయితీ. వీరు ఈ సంప్రదాయాన్ని తిరిగి తీసుకువచ్చారు. అనంతరం అల్పాహారం విందు ఆరగించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

● ఉపాధ్యాయులకు సత్కారం


వేంపల్లెలోని తల్లిశెట్టి శేషమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థినులు

వేంపల్లె, సెప్టెంబరు 15: వారందరు 38ఏళ్ల క్రితం ఆ పాఠశాలలో చదువుకున్న వారు అందరు వివాహాలు చేసుకొని వివిధ ప్రాంతాలలో స్థిరపడ్డవారు. పాత జ్ఞాపకాలను ఒక్కసారి గుర్తుచేసుకొని పూర్వ విద్యార్థినిలు ఒక్కచోటకు చేరుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను మనసారా గుర్తుకుతెచ్చుకొని ఆనందపడ్డారు. వేంపల్లెలోని తల్లిశెట్టి శేషమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో 1985-86 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తైన విద్యార్థినిలు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అపుడు చదువుచెప్పిన ఉపాధ్యాయులు మంగమ్మ, సరస్వతమ్మ, శంకుంతలమ్మ, సరోజమ్మలను శాలువ, పూలమాలలతో సత్కరించి నూతన వస్త్రాలుఅందించారు. పూర్వ విద్యార్థినులు షకీల, రాజేశ్వరి, నాగవల్లి ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల్లో ఉంటున్న అందరు కలుసుకొని కబుర్లు చెప్పుకొన్నారు. ఒకరిగురించి ఒకరు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సరళ, పద్మ, భాను, ధనలక్ష్మి, గీతావాణి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా ప్రారంభమైన శ్రీవారి పవిత్రోత్సవాలు

కడప (కల్చరల్), సెప్టెంబరు 15: దేవుని కడపలో వెలసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీవారి పవిత్రోత్సవాలను కన్నుల పండువగా ప్రారంభించారు. నాలుగురోజుల పాటుగా (ఈనెల 18వరకు) జరగనున్న పవిత్రోత్సవాలలో మొదటి రోజైన ఆదివారం సాయంత్రం 6 గంటలకు అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళకరంగా ప్రారంభించారు. తొలుత అంకురార్పణం విశ్వక్‌సేనపూజ, పుణ్యాహవచనం, అనుగ్న, రక్షాబంధనం, అఖండ దీపారాధన, పవిత్రదివసం, తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు కృష్ణమోహన్ తదితరులు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 15: పట్టణంలోని పలుప్రాంతాలలో సోమవారం ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కెవి పులివెందుల సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా మెయిన్‌రోడ్డు, అంబకపల్లె రోడ్డు, బైపాస్‌రోడ్డు, లేఅవుట్, ఎస్‌బీఐకాలనీ, కడప రోడ్లలో ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి


మాట్లాడుతున్న సేవానాయక్

కడప రూరల్, సెప్టెంబరు 15: ఖాళీగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.సేవానాయక్ డిమాండ్ చేశారు. కడప నగరం కోటిరెడ్డి సర్కిల్‌లోని బహుళార్ధ పశువైద్యశాలలో ఆదివారం ఆ ఫెడరేషన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం చైర్మన్ నంద్యాల రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి సేవానాయక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగు చర్యలను తీసుకోవాలన్నారు. మహిళా ఉద్యోగులు పనిచేస్తున్న కార్యాలయాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ విభాగాలకు ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ జిల్లా చైర్మన్‌గా నంద్యాల రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. అలాగే ఏపీ లైవ్ స్టాక్ అసిస్టెంట్ సర్వీస్ అసోసియేషన్ ఎన్నికలను, ఏపీ జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ అండ్ వెంటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసరర్స్ సంఘం ఎన్నిలను ఎన్నికలను నిర్వహించారు. ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, కార్యదర్శి రవికుమార్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శారదమ్మ ఆయా సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి మార్గాలు

● ఉపవిద్యాధికారి రాజగోపాల్


బహుమతులు అందిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 15 : మానసిక శారీరక వికాసానికి క్రీడలు ఎంతగానో తోడ్పడుతాయని కడప ఉపవిద్యాధికారి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం యూటీఎఫ్ భవన్‌లో జాతీయ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని యూటీఎఫ్ కడప జిల్లాశాఖ ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి క్రీడాపోటీలునిర్వహించడం సంతోషసదాయమన్నారు. నిరంతరం విద్యాబోధనలో తలమునకలై ఉండే ఉపాధ్యాయులకు ఈ పోటీలనిర్వహణ ఆటవిడుపులాంటిన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు నరసింహారావు, ఎజాజ్‌అహ్మద్, ఎం.ప్రభాకర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పఠాన్ ఖాజాపీర్‌కు భారత సేవారత్న అవార్డు


ఖాజాపీర్‌ను సత్కరిస్తున్న సోమలరాజు ఫౌండేషన్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 15 :నాలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన స్వచ్ఛంద సంస్థలను గుర్తించి బెంగుళూరు సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా అందిస్తున్న జాతీయ పురస్కారానికి స్టాండ్ టు సర్వ్ సంస్థ అధ్యక్షుడు, 44వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ పఠాన్ ఖాజాపీర్‌ను ఎంపిక చేశారు. ఆయన బెంగుళూరు అంబేడ్కర్ భవన్‌లో భారత సేవారత్న పురస్కారాన్ని అందుకున్నారు. అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్న స్టాండ్ టు సర్వ్ అధ్యక్షుడు పఠాన్ ఖాజాపీర్ మాట్లాడుతూ సోమలరాజు ఫౌండేషన్ గుర్తించి పు రస్కారానికి ఆహ్వానం పలకడం సంతోషంగా ఉందన్నారు. మరెన్నో సేవలందించేందుకు తోడ్పాటుగా భావిస్తున్నానన్నారు. ఈ పురస్కారం ప్రజలకు అంకితమని తెలిపారు. మాతో అనేక మంది సేవా బావంతో ముందుకు రావడం మాకు సంతోషాన్నిచ్చిందన్నారు. అనేక సేవలు చేసే అవకాశాన్ని కల్పించడం భగవంతుడు ఇచ్చిన ఒక అవకాశంగా భావిస్తున్నామన్నారు.

పాత కలెక్టరేట్‌ను అందంగా తీర్చిదిద్దుతాం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 15:పాత కలెక్టరేట్‌ను అందంగా తీర్చిదిద్దు జిల్లాకు వారసత్వ కానుకగా అందజేస్తామని పలువురు ప్రభుత్వ ఇంజనీర్లు తెలిపారు. ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజనీర్స్‌డే సందర్భంగా స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ ఆధ్వర్యంలో ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిధిగా ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతికి మించిన ఇంజనీరు లేడన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనరు చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ వ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం ఉందని, వారసత్వ సంపద అయిన పాత కలెక్టరేట్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్ఈ రామచంద్రారెడ్డి, డీఈలు చెన్నకేశవరెడ్డి, మూర్తి మురళి, సుధాకర్‌లు మాట్లాడారు. పోతుల వెంకట్రామిరెడ్డి, షేక్ నియాజ్, ఆకుల సుబ్బరాయుడు పాల్గొని ఇంజనీర్లను ఘనంగా సత్కరించారు.

వ్యక్తిని చాకుతో పొడిచిన యువకులు

కడప (క్రైం), సెప్టెంబరు 15: బిల్టప్ సర్కిల్ సమీపంలో ఓ వ్యక్తిని కొందరు యువకులు చాకుతో పొడిచి గాయపరిచినట్లు తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు బిల్టప్ ప్రాంతీయుడు మహ్మద్ ఆదివారం బారు వద్ద మద్యం తాగుతుండగా రామరాజు పల్లి వాసి రాజగోపాల్ అతడి స్నేహితులతో అహ్మద్‌కు గొడవ జరిగింది. బారు సమీపంలో రాజగోపాల్ స్నేహితులతో కలిసి బయటకు వచ్చిన అహ్మద్‌ను చాకుతో పొడిచి గాయపరిచినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

వేంపల్లె, సెప్టెంబరు 15: మండలంలోని నందిపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం పనినిమిత్తం మండలంలోని నందిపల్లె గ్రామం నుంచి మోటర్ బైకులో ఉపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి వస్తుండగా గుర్రమ్మ అనే మహిళ లిఫ్ట్ అడగ్గా మోటర్ బైకును నిలబెట్టడం జరిగింది. దీంతో వెనుక వైపునుంచి మరో మోటార్ బైకు ఢీకొంది. దీంతో ఉపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డికి, గుర్రమ్మ అనే మహిళకు రక్తగాయాలయ్యాయి. ఇరువురిని 108 ద్వారా చికిత్స కోసం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం


వినాయకుడిని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

వేంపల్లె, సెప్టెంబరు 15:వేంపల్లె మండలంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక చైతన్య హైస్కూల్లో తొమ్మిదిరోజుల పాటు వినాయకుడిని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఆదివారం పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. కర్ణాటక డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాపు వీధిలో ఏర్పాటు చేసిన విగ్రహానికి వినాయక నిమజ్జన కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. పట్టణంలో ఊరేగించారు. రంగులు చల్లుకొని సంబరాలు జరుపుకున్నారు. ఇంకా పలుచోట్ల ఏర్పాటు చేసిన నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.


హిందూ ధర్మం కోసం నిరంతరం పోరాడదాం


మాట్లాడుతున్న హిందూ ధర్మ ప్రచార కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి

చెన్నూరు, సెప్టెంబరు 15 : హిందూ ధర్మం కోసం నిరంతరం పాటుపడదామని సమరసత సేవా సంస్థ మండల శాఖ అధ్యక్షుడు హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు జీఎస్ భాస్కర్ రెడ్డి అన్నారు. చెన్నూరు మల్లేశ్వరాలయంలో ఆదివారం రాత్రి గ్రామ పెద్దలు, హిందూ ధర్మ పరిరక్షణ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాబోయే దసరాకు ఆర్ఎస్ఎస్ ఏర్పడి వంద ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మండల వ్యాప్తంగా పలు రకాల కార్యక్రమాలు చేపట్టబోతున్నామని తెలిపారు. మండల కేంద్రమైన చెన్నూరులో ఆర్ఎస్ఎస్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు గ్రామ పెద్దలందరితో సమావేశం నిర్వహించి స్థలాన్ని సేకరించి విజయదశమి రోజున శంకుస్థాపన చేస్తామన్నారు. మాజీ సర్పంచ్ జయభారత్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో హిందూ ధర్మానికి ఆర్ఎస్ఎస్ పునాదిగా ఉందన్నారు. యువత హిందూ సమసమాజ స్థాపన కోసం అడుగులు వేస్తోందని, దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, అన్ని ప్రాంతాల్లో పలు రకాల కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఇలాంటి పరిస్థితుల్లో మండలంలో కూడా ఓ కార్యాలయం అవసరమని, ఇందుకు గ్రామ పెద్దలు కలిసి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కావున గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణం కోసం దాతలు ఎంతో మంది ఉన్నారన్నారు.ఈ కార్యక్రమంలో బలిజ సంఘం జిల్లా నాయకుడు ఆకుల ప్రసాద్‌బాబు, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శివారెడ్డి, బీజేపీ మండల శాఖ మాజీ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్, హిందూ ధర్మ ప్రచార కమిటీ సభ్యులు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ మండల ప్రముఖ్ వెంకటసుబ్బయ్య, లేవాకు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుల ఊరేగింపు


కొండపేటలో గణనాథుని ఊరేగింపు

చెన్నూరు, సెప్టెంబరు 15 : మండల వ్యాప్తంగా తొమ్మిదిరోజుల పాటు పూజలందుకున్న గణనాధున్ని ఆదివారం వివిధ గ్రామాల్లో ఊరేగించారు. కొండపేట, ముండ్లపల్లె, గుర్రంపాడు తదితర గ్రామాల్లో వీధివీధినా ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో లడ్డు వేలం పాట పోటాపోటీగా నిర్వహించారు. అలాగే ఊరేగించిన గణనాధులను సమీప పెన్నా నదిలో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా సీఐ పురుషోత్తంరాజు మాట్లాడుతూ అన్ని విఘ్నాలను తొలగించే గణేశున్ని నిత్యం పూజించడం, స్మరించడం ఎంతో ఉత్తమమని అలాంటిమూర్తికి తొమ్మిదిరోజులపాటు పూజించడం సంతోషమన్నారు. ఈ సందర్భంగా ముండ్లపల్లెలో సీఐని ఉత్సవ కమిటి నిర్వాహకులు సత్కరించారు.



జై గణేశా.. బై గణేశా..!

● వేడుకగా నిమజ్జనోత్సవాలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 15: మండలంలోని మోరగుడి గ్రామంలో ఆదివారం గణేష్ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు ఈ నెల 7న కొలువుదీరిన గణేష్ విగ్రహాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి నిమజ్జనానికి తరలించారు. దారి పొడవునా టపాసులు పేల్చుకుంటూ, రంగులు చల్లుకుంటూ యువకులు, విద్యార్థులు, స్థానిక మహిళలు నిమజ్జనానికి వెళ్లారు. ముద్దనూరు రోడ్డువైపు నుంచి పలు విగ్రహాలను భక్తులు నిమజ్జనానికి తరలించారు.

ప్రొద్దుటూరు టౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీర్చిన గణనాథులను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఉదయం వినాయకుడికి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం కొన్ని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. గణనాథులను ట్రాక్టర్లలో ఎక్కించి డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో పురవీధుల్లో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. బొల్లవరంలోని మహర్షి వీధిలో వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు. పిల్లలు, యువతులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంలో మణికంఠారెడ్డి రూ.37 వేలకు స్వామివారి లడ్డూను దక్కించుకున్నారు. చాపాడు, కామనూరు, థర్మల్ రోడ్డులలోని పెన్నానది, కుందూ నదులలో వినాయకుని నిమజ్జనం నిర్వహిస్తున్నారు.

బ్రహ్మంగారిమఠం: మండల కేంద్రంలోని అయ్యప్ప నగర్‌లో ప్రతిష్ఠించిన బొజ్జగణపయ్యను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంలో స్వామివారి లడ్డును అంకిరెడ్డిపల్లె చంద్ర ఓబుల్‌రెడ్డి రూ.40 వేలకు, చిన్నలడ్డు జోగయ్య రూ.25 వేలకు, కలశం చెంబును విద్యుత్‌శాఖ లైన్‌మన్ నాగేంద్ర రూ.11వేలకు కైవసం చేసుకున్నారు. అనంతరం డప్పువాయిద్యాలు, పటాసులతో చిన్నారుల కోలాటం నడుమ బ్రహ్మంసాగర్‌లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అయ్యప్పనగర్ గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.


మోరగుడిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


ప్రొద్దుటూరు: నృత్యాలు చేస్తున్న యువతులు

మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి


బద్వేలు, సెప్టెంబరు 15: నియోజకవర్గంలోని ప్రతి సచివాలయ పరిధిలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందించాలని డీవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని తెలిపారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో విషజ్వరాలు టైఫాయిడ్, మలేరియా లాంటి వ్యాధులతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా వైద్యాశాఖాధికారులు మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేసి వైద్యం పేదలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షుడు ఫాతిమా, ఇమ్మానుయేల్, ఖలీల్‌బాషా, ట్రెజరర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు గురుకుల విద్యార్థినుల ఎంపిక

కొండాపురం, సెప్టెంబరు 15 :రాష్ట్ర స్థాయి అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీలకు స్థానిక బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు జీ.కీర్తన, టీ.తులసి, ఖోఖో పోటీలకు నాగవల్లీ, వై.అంజలి ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. వీరు శనివారం గండిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించారని వివరించారు. ఆయా విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది అభినందించారు.

19 నుంచి ఎస్‌జీఎఫ్ పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 15: మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్లు బాబు, ఓబయ్య తెలిపారు. బాలబాలికలకు అండర్-14, అండర్-17 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రాయలసీమ వ్యాయమ విద్యా కళాశాలలో 19వ తేదీ ఉదయం 7 గంటలకు అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, 20వ తేదీ ఉదయం 8 గంటలకు కబడ్డీ, ఖోఖో, 21వ తేదీ కల్లూరు జడ్పీ హైస్కూలులో ఉదయం 8 గంటలకు వాలీబాల్, యోగా, చెస్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.



యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పోరుమామిళ్ల, సెప్టెంబరు 15: ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు విజయకుమార్, జిల్లా కార్యదర్శి చెన్నయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూటీఎఫ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌రావు, గౌరవ అధ్యక్షుడు సుధీర్‌కుమార్, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, ఆదిత్యలక్ష్మి, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా గంగయ్య, విజయరావు, సీపీఎస్ అధ్యక్షుడుగా గురయ్య, జిల్లా కౌన్సిలర్లుగా చంద్రశేఖర్, చెన్నయ్య, రాఘవేంద్ర, క్రిష్ణయ్య, నాయబ్ రసూల్, శ్రీనివాసలు, ఈశ్వర్‌రావుల ను ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కొండాపురం, సెప్టెంబరు 15 : మండలంలోని తాళ్లప్రొద్దుటూరు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 2006-07 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి అలనాటి విద్యార్థులు తమ మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమ ఉన్నతికి తోడ్పడిన గురువులను సన్మానించారు. హెడ్మాస్టర్లు సాంబ శివారెడ్డి, రేణుకారెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు రామచంద్రుడు, జయమ్మ, శంకర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, ఖాజామొహిద్దీన్, రవీంద్రారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అంకిరెడ్డి, శ్రీనివాసులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కొండాపురం, సెప్టెంబరు 15: మండలంలోని గండ్లూరు వంక సమీపంలో ఆదివారం గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జంతుబలులు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల సమస్యలపై పోరుకు ముందుండాలి

● ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 15: జర్నలిస్టుల సమస్యలపై పోరు సాగించేందుకు పాత్రికేయులు సంసిద్ధంగా ముందుండాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యుజె) రాష్ట్ర కార్యదర్శి పి. రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏపీయూడబ్ల్యుజె జిల్లా నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ఏపీయూడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి పి. రామసుబ్బారెడ్డి నేతృత్వం వహించగా జిల్లావ్యాపితంగా గల జర్నలిస్టులు హాజరయ్యారు. కాగా ఎన్నికల అధికారులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు రామాంజనేయరెడ్డి, శ్రీనివాస్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జర్నలిస్టుల ఐక్యతకు నిదర్శనమన్నారు. ప్రధానంగా జిల్లాలోని జర్నలిస్టుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.


బాలకృష్ణారెడ్డి, అధ్యక్షుడు


శ్రీనివాసులు, కార్యదర్శి

జిల్లా కార్యవర్గం ఇదే..

నూతన కమిటీ అధ్యక్షుడిగా మోపూరి బాలకృష్ణారెడ్డి (సాక్షి బ్యూరో), కార్యదర్శిగా శ్రీనివాసులు (ఏబీఎన్ బ్యూరో), గౌరవ అధ్యక్షుడిగా వెంకటరెడ్డి (సాయంకాలం ఎడిటర్), ఉపాధ్యక్షుడిగా గంగవరం వెంకట శివారెడ్డి (ఆంధ్రజ్యోతి), సలహాదారులుగా పి.విశ్వప్రసాద్ రెడ్డి, రామాంజనేయరెడ్డి, కోశాధికారిగా నరసింహ (ఆంధ్రప్రభ) ఎన్నికయ్యారు.



PUBLIC NOTICE

Iam instructed by my client M/s Shriram Finance Ltd., Porumamilla Branch, rep. by its Manager, the public is nodified as follows : Sri one **Yerragolla Veera Brahmaiah** S/o **Pedda Subbarayudu,** r/o Mittamanupalle Village, Mydukur Mandal, Kadapa Dt. has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any righ/possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within A Week from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after five days, they will not be taken into account. **Particulars of Property :** Kadapa Dt, Badvel Sub-Dt, Porumamilla Mdl. Rangasamudram village fields, Sy. No. 1070-1, Ac. 0.21 cents or 0.085 Hectors - located near D.No. 197, Demarked as Plot No. 109 Ac. 0.03 cents or 146.66 Sq. Yards, out of Ac. 0.21 cents. **Boundaries :** East - Road of 25 feet width, South - Plot No. 108, West-Plot No.111, North- Plot No. 110 **Measurements :** East - West - 60 Feet 18.28 Mtrs. North - South - 22 Feet or 6.70 Mtrs. -Totalling to 146.66 Sq. Yards or Ac. 0.03 cents - with all easement rights

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

పోలేరమ్మ, అంకాలమ్మకు బోనాలు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 15: రంగసముద్రం పంచాయతీ పరిధిలోని రెడ్డినగర్‌లో వెలసిన పోలేరమ్మ, అంకాలమ్మకు కోదండ రామస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా కమిటీ సభ్యులు ఆదివారం బోనాలు సమర్పించారు. బోనాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ చాపాటి నారాయణరెడ్డి, పాలకొలను రామసుబ్బారెడ్డి, కాకర్ల బాలుడు , సిద్ధమూర్తి, రాజారెడ్డి, ప్రగతి శ్రీనివాస్,రిటైర్డ్ ఏఎస్‌ఐ గంగన్న, పాలకొలను రమణారెడ్డి , తిమ్మారెడ్డి,చెన్నారెడ్డి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





PUBLIC NOTICE

Iam instructed by my client M/s Shriram Finance Ltd., Porumamilla Branch rep. by its Manager, the public is nodified as follows : Sri one **Thudimella Veeralakshmi Devi** W/o **Polaiah,** r/o 8-2-352, Venkataiah Nagar, Badvel, Kadapa Dt. has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any righ/possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within A Week from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after five days, they will not be taken into account. **Particulars of Property :** Kadapa Dt, Kadapa Registration District, Porumamilla Mdl. Porumamilla Village fields. **Item No., :-1** Sy. No. 92/1, Ac. 0.04 1/2 cents or 217.8 Sq. Yards, out of Ac. 1.77 cents - Residential Area located near D.No. 16/95 of Bestha Street, **Item No., :-2** Sy. No. 92/2, Ac. 0.21 1/2 cents or 1040.6 Sq. Yards, Total of Ac. 0.26 cents or 1258.4 Sq. yards - as the two items ae in one compact block. **Boundaries :** East - Land of Pasupuleti Subbaiah, South - land of Dasari Veeraiah, West - Rastha, North - Land of Chinna Brahmaiah

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

రోగులకు పండ్లు పంపిణీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 15: జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం మహ్మద్‌ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని రోగులకు గౌసియా పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రి కుమారుడు తాహీర్‌పీరాఖాద్రి, కమిటీవారు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌషియా మసీదు కమిటీ, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 15: నియోజకవర్గంలోని కొండ సుంకేసుల గ్రామంలో ఆదివారం మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ వారు పుల్లారెడ్డి అనే వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక చెన్నకేశవస్వామి ఆశ్రమంలో ఉంటున్న కాసా పుల్లారెడ్డి (78) అనారోగ్యంతో మృతిచెందగా, అంత్యక్రియలు చేసేందుకు బంధువులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఇలాంటి కార్యక్రమానికి ఎవరైనా 8297253484 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే వెంటనే ముందుకు వస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అహమ్మద్‌హుస్సేన్, మోరే లక్ష్మణరావు, నరేంద్ర, అన్సర్, వెంకటేష్, వల్లి, తదితరులు పాల్గొన్నారు.



PUBLIC NOTICE

Iam instructed by my client M/s Shriram Finance Ltd., Porumamilla Branch rep. by its Manager, the public is nodified as follows : Sri one **Kuraku Chandra Obul Reddy** S/o **Pedda Obul Reddy,** r/o 1-87, Gunthapalli Village, B. Kodur Mandal, Kadapa Dt. has applied for loan to our firm and after going through documents of her right over the below mentioned property, my client-firm decided to grant loan to her. If anybody has got any righ/possession and title over the property or if any litigation is pending in any Court of Law, it shall be brought to the notice of my client, with documentary proof, within A Week from the date of this notice, failing which my client will disburse the loan amount. Any objections received after five days, they will not be taken into account. **Particulars of Property :** Kadapa Dt, Proddatur Registration District, Badvel Sub-District, Badvel Mandal, Madakalavaripalli Village fields, Sy.No. 856/2, Ac. 0.05 cents or 0.020 Hectors demarked as Plot No. 1 and 2, located near D.No. 4-1-725 (Old D.No. 7/126) in Anjaneya Nagar, Weaker Section Area **Boundaries :** East - Road leading to Sivalayam, South - Road, West - Site of Cheemala Subba Reddy, North - Site of Janapati Vasu and Others, **Measurements :** East - West - 60 Feet 20.03 Mtrs. North - South - 33 Feet or 10.01 Mtrs. -Totalling to 242 Sq. Yards with all easement rights

P.RAJESWARA RAO
ADVOCATE, BADVEL.

వెంకటేశ్వరుడికి శ్రవణ నక్షత్ర పూజలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 15: స్థానిక పాత మార్కెట్‌లోని లలితాదేవి రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

కంభం పాములేటికి కళా భూషణ్ అవార్డు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 15: పట్టణానికి చెందిన శ్రీ చౌడేశ్వరీ ఆర్ట్స్ కళాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కంభం పాములేటికి కళాభూషణ్ జాతీయ అవార్డు లభించింది. బళ్లారిలోని బసవరాజేశ్వరి పబ్లిక్ స్కూలులో ఆదివారం బళ్లారి కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ 52వ వార్షికోత్సవం సందర్భంగా బళ్లారి గురుపీఠం అధిపతి కల్యాణస్వామి, అసోసియేషన్ అధ్యక్షుడు బ్రహ్మయ్య ఆయనకు జ్ఞాపిక, సర్టిఫికెట్‌ను అందజేశారు.







